ప్రతీ కాలనీలో సీసీ రోడ్లు

- మేయర్ హరివెంకట కుమారి
- 69.72, 75, 86, వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గాజువాక : నగర పరిధిలోని వార్డుల్లో ప్రతీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చామని జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. 72వ వార్డు చైతన్యనగర్, వుడా కాలనీ, కృష్ణదేవరాయ నగర్‌లో రూ.79.35 లక్షలతో చేపట్టనున్న సీసీ, బీటీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో నగరాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతున్నామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు, 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు సిరట్ల శ్రీనివాస్, స్థానిక నాయకులు రామిరెడ్డి, సుబ్బారావు, గుడివాడ అమ్మన్న, శ్రీనివాస్, రమణ, సాయి పాల్గొన్నారు.

69వ వార్డులో రూ.కోటిన్నరతో ..

అక్కిరెడ్డిపాలెం: గాజువాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 69వ వార్డులోని పలు ప్రాంతాల్లో సుమారు కోటిన్నర రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బీటీ రోడ్ల పనులకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనతికాలంలో గాజువాకను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. వైఎస్సార్‌సీపీ గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి చందు, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


69వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

86వ వార్డులో రూ.1.35 కోట్లతో..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో సుమారు 1 కోటి 35 లక్షల రూపాయల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. సాయిరాం నగర్, ఫేజ్-6, రాసాలమ్మకాలనీ, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టు నిర్మాణాలకు వారు శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో 86వ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, కర్రి ఈశ్వరరావు, బొడ్డ రమణ, రాజాన నాయుడు, కర్రి శ్రీరాములు, కరెడ్ల రాము, కుమార్ పాల్గొన్నారు.


72వ వార్డులో శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్యే నాగిరెడ్డి

రూ.70 లక్షలతో స్టేజీ నిర్మాణం

పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ ప్రజల దశాబ్దాల కలను నెరవేరుస్తున్నామని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. 75వ వార్డు నెల్లిముక్కు సదనుపట్టు మల్టీ పర్పస్ స్టేజీ నిర్మాణానికి ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావుతో కలసి గురువారం శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ రూ.70 లక్షలతో ఈ స్టేజీ నిర్మించనున్నామని తెలిపారు. పెంటమాంబ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పెంటమాంబ ఆలయ కమిటీ అధ్యక్షుడు పులి రాజారెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి సత్యారావు, పిట్ట సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన నాయకులు


అనకాపల్లి జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు, 68వ


వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీఫ్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.
- పెదగంట్యాడ/అక్కిరెడ్డిపాలెం

'జగనన్న సురక్ష'తో పేదలకు మెరుగైన వైద్యం

గాజువాక : జగనన్న ఆరోగ్య సురక్షతో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. 70వ వార్డులో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు వైద్యం అందలేదని రాష్ట్రంలో ఏ కుటుంబమూ బాధపడకుండా చూడటమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమల్లోకి తెచ్చారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

76వ వార్డులో 612 మందికి సేవలు

పెదగంట్యాడ: 76వ వార్డు సచివాలయం 1-2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని నెల్లిముక్కు పీహెచ్‌సీలో గురువారం నిర్వహించారు. శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉరుకూటి చందు ప్రారంభించారు. శిబిరంలో 612మందికి నెల్లిముక్కు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు, ఈఎన్‌టీ వైద్యుడు నాగరాజు, ఆర్థోపెడీషియన్ డాక్టర్ సుధీర్ పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తనకాల సత్యనారాయణ, గొందేశి రమణారెడ్డి, ఉరుకూటి సింహాద్రి, ఆనంద్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.


76వ వార్డులోని శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న ఉరుకూటి చందు

దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలో మాక్‌డ్రిల్

అగనంపూడి: దువ్వాడ వీఎస్ఈజెడ్ ఆవరణలో కేమిటెక్ ఆల్కోసైడ్స్ కర్మాగారంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. రసాయన కర్మాగారాల్లో రసాయనాల పేలుళ్లు సంభవించినప్పుడు, ప్రమాదాలు జరిగినప్పుడు మంటలను ఎలా అదుపు చేయాలి, క్షతగాత్రులను ప్రమాదం బారి నుంచి తప్పించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో మాక్‌డ్రిల్ ద్వారా భద్రతా సిబ్బంది వివరించారు. దువ్వాడ వీఎస్ఈజెడ్ ఏడీసీ ప్రసన్నకుమార్, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.


ఫోమ్‌తో మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా

మహా శివరాత్రికి ప్రత్యేక బస్సులు

ఉక్కునగరం: మహా శివరాత్రి సందర్భంగా విశాఖ స్టీల్ సిటీ డిపో ఆధ్వర్యంలో అప్పికొండకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని డిపో మేనేజర్ తెలిపారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు ఈ బస్సులు నడపనున్నట్లు చెప్పారు.

పెన్షనర్ల నిరసన

అగనంపూడి: ఈపీఎఫ్-95 సమస్యలు పరిష్కరించాలని ఏడేళ్ల నుంచి కోరుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని ప్రభుత్వరంగ సంస్థల విశ్రాంత కార్మికుల అసోసియేషన్ ప్రతినిధులు విందుల వరహాలు, బి.సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈపీఎఫ్ 95 పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈపీఎఫ్ జాతీయ కమిటీ పిలుపు మేరకు అగనంపూడిలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు పైలా అప్పారావు, పాలవలస కృష్ణ, జగదీష్, సలీమ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడి సన్నిధిలో సహస్ర దీపాలంకరణ


దీపాలంకరణలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్-3 కాంప్లెక్స్‌లోని వరసిద్ధి వినాయక ఆలయంలో గురువారం రాత్రి సహస్ర దీపాలంకరణ ఘనంగా జరిగింది. ఆలయం 18వ వార్షికోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు

డోమినోస్ రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం



రెస్టారెంట్ వద్ద పరిశీలిస్తున్న ఏసీపీ త్రినాథ్

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం పరిధిలోని డోమినోస్ రెస్టారెంట్ బిల్డింగ్‌లో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఏసీపీ త్రినాథ్ తెలిపిన వివరాల ప్రకారం .. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. మెషినరీ ఐటెమ్స్ దగ్ధం కావడం వల్ల సుమారు 50 వేల రూపాయల ఆస్తినష్టం జరిగిందని అంచనా వేశారు. దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు పాల్గొన్నారు.

జెడ్సీని కలిసిన కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: గాజువాక జోనల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సన్యాసినాయుడును 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. వార్డు అభివృద్ధిపై జెడ్సీతో చర్చించారు.

1120వ రోజుకు ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1120వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు, ఉక్కు భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

గణపతిరెడ్డి నియామకం



ఉక్కునగరం: జాతీయ కార్మిక సంఘం హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) జాతీయ వర్కింగ్ కమిటీ సభ్యునిగా స్టీల్ హెచ్ఎంఎస్ ప్రధాన కార్య దర్శిజి.గణపతిరెడ్డి నియమితులయ్యారు. ఆయనకు గురువారం అధికారిక ఉత్తర్వులు అందాయి. ఇటీవల నిర్వహించిన హెచ్ఎంఎస్ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు.

అతివలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న డాక్టర్ మృదులాదేవి


మహిళలను సత్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు


డాక్టర్ సూర్యప్రభను సత్కరిస్తున్న చైతన్య మహిళా కళాశాల అధ్యాపకులు

రేపటికి ముందడుగు

అగనంపూడి: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డాక్టర్ మృదులాదేవి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మగువల ప్రగతికి ప్రభుత్వాలు అవకాశాలు కల్పిస్తున్నాయని, వాటిని వినియోగించుకొని సాధికారిత సాధించాలని ఆకాంక్షించారు.

అమ్మ అందరికీ ఆదర్శం

గాజువాక : ప్రతి ఒక్కరూ తమ తల్లిని ఆదర్శంగా తీసుకోవాలని ప్రముఖ వైద్యురాలు వి.సూర్యప్రభ అన్నారు. స్థానిక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇంట్లో ప్రతీ పనిని సకాలంలో విజయవంతంగా నిర్వహించేందుకు, కుటుంబాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు నిర్వర్తించే బాధ్యతలతో పాటు సమాజ అభివృద్ధిలో అమ్మ పాత్ర అమోఘమన్నారు. అనంతరం కళాశాల అధ్యాపకులు ఆమెను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.చంద్ర మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

30 మంది మహిళలకు పురస్కారాలు

పెదగంట్యాడ: పత్రీజీ పిరమిడ్ స్పిరిచ్యువల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెదగంట్యాడ కమ్యూనిటీ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ ప్రతినిధి మీసాల శివగణేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన వేడుకకు సీనియర్ పిరమిడ్ మాస్టర్ రమణమ్మ, శారద, నంద ప్రసాదరావు, బ్రహ్మకుమారీలు హాజరయ్యారు. దుర్గమాంబ బృందం కోలాటం, పావని సంగీత విభావరి అలరించాయి. 30 మంది మహిళలకు పురస్కారాలు అందజేసి, సత్కరించారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఉక్కునగరం: కుటుంబ నిర్వహణలో నిమగ్నమైన మహిళలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఉక్కు జనరల్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ సునీత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సృష్టి వరల్డ్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ రాజేశ్వరి, పాఠశాల ఈడీ డాక్టర్ కె. మేఘన, డైరెక్టర్ పి.సుశీలారాణి ప్రసంగించారు.

స్టీల్‌ప్లాంట్‌లో హోరెత్తిన 'తాలీ బజావో'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు గురువారం నిర్వహించిన 'తాలీ బజావో' నినాదాలతో హోరెత్తింది. ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు తక్షణమే అమలు చేయాలని, ప్లాంట్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తి తీయాలని, స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాకే బార్స్‌ను ప్రవేశపెట్టాలన్న డిమాండ్లపై కార్మికులు ఉదయం ఎల్‌డీసీ విభాగం నుంచి ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వరకు నిలబడి తమ నిరసన తెలిపారు. కంచాల మోత మోగిస్తూ తమకు వెంటనే న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు యువ కార్మికులు మాట్లాడుతూ 2007 నుంచి 2019 వరకు జాయిన్ అయిన 3680 మందికి పైగా ఉన్న ఉద్యోగులు చాలీచాలని జీతాలతో సతమతమవుతున్నారన్నారు. పలు కార్మిక సంఘాల నాయకులు అక్కడికి వచ్చి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కోరాడ వెంకటరావు, జెర్రిపోతుల మోహన్‌కుమార్, ధర్మాల కనకరెడ్డి, దుర్గాప్రసాద్, గవర అచ్చిబాబు, రాజా, మహేష్, మరిడయ్య, నమ్మి సింహాద్రి, ప్రసాద్, చంద్రశేఖర్, రామకృష్ణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


స్టీల్‌ప్లాంట్‌లో కంచాలను మోగిస్తూ నిరసన తెలుపుతున్న యువ కార్మికులు

పారిశ్రామిక వేత్తలు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక వేత్తలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్.ఎస్.రావు సూచించారు. ఆటోనగర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న ఎంఎస్ఎంఈ ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈల ద్వారా అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఎస్ఎంఈ ఏర్పాటు చేసిన పారిశ్రామిక ఎగ్జిబిషన్ పలువురికి ఉపయోగకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సంజీత్ కుమార్ దేబ్‌నాథ్, ఎన్ఎస్ఐసీ మేనేజర్ కమలేశ్వరి, ఎంఎస్ఎంఈ సీనియర్ మేనేజర్ డాక్టర్ విజయ కృష్ణ కుమార్, ఐలా చైర్మన్ కె. సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి సిహెచ్. సత్యనారాయణ, లఘు ఉద్యోగ్ భారతి జాతీయ బోర్డు సభ్యుడు బాలాజీ, పలువురు పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న గెయిల్ సీజీఎం రావు

షిర్డీ సాయి శాంతిధామం వార్షికోత్సవాలు ప్రారంభం

పెదగంట్యాడ: సమతానగర్‌లోని షిర్డీ సాయి శాంతి ధామం 10వ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయినాథుడిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. వేకువజామున కాకడ హారతి, ధునిపూజ, సాయి చాలీసా పారాయణం, సాయం సంధ్యా హారతి, పల్లకీ సేవ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నక్క లక్ష్మణరావు మాట్లాడుతూ ఈ నెల 12 వరకూ ఉత్సవాలను నిర్వహించనున్నామని తెలిపారు.


సాయి చాలీసా పారాయణం చేస్తున్న మహిళలు

'సమస్యలు పరిష్కరించాకే బయోమెట్రిక్ అమలు'

ఉక్కునగరం: కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు బయోమెట్రిక్ నిలిపి వేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. పోరాట కమిటీ నాయకులు ప్లాంట్‌లోని అన్ని విభాగాధిపతులను కలిసి తమ డిమాండ్లను వివరించారు. బయోమెట్రిక్ అమలు తమకు అభ్యంతరం కాదని, సమస్యలు పరిష్కరించిన తర్వాత బయోమెట్రిక్ అమలుకు తాము సిద్ధమని వారు తెలిపారు. అంత వరకు ప్రస్తుతం ఉన్న డార్స్ హాజరు పద్ధతిని కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కె.ఎస్.ఎన్. రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, యు.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.


స్టీల్‌ప్లాంట్ కోక్‌ఓవెన్స్ ఇన్‌చార్జ్ విభాగాధిపతితో చర్చిస్తున్న నాయకులు

సమైక్యంగానే హక్కుల సాధన

గాజువాక: మహమ్మదీయులు సమైక్యంగా హక్కుల కోసం ప్రశ్నించాలని హజరత్ అల్లామా మౌలానా హాపిజ్ వారి జనాబ్ మహమ్మద్ షాకీర్ సూరి అన్నారు. గాజువాక అజీమాబాద్‌లోని పైజానే ఏ హజరత్ సయ్యద్ మదీనా షా ఔలీషా సమావేశం నిర్వహించారు. గాజువాక ముస్లిమ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సాధిక్ రిజ్వీ, అజీమాబాద్ సున్నీ జామా మసీద్, మదీనా మసీద్, గౌసియా మసీద్ ప్రతినిధులు మాట్లాడారు. యూత్ కమిటీ ప్రతినిధులు అంజుమన్ సీరుతేనబీ నూర్ పార్టీ అంజుమాన్ గౌస్, మదీనా షైరీ పార్టీ, రాజా పార్టీ, గౌషియా నౌజవాన్ సొసైటీ, కేజీఎన్ పార్టీ, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ,మదీనావలీ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జనాబ్ మహమ్మద్ షాకీర్ సూరి

18 నుంచి పైడిమాంబ జాతర మహోత్సవాలు

పెదగంట్యాడ: నడుపూరు గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవాలను ఈ నెల 18 నుంచి 26వ వరకు పైడిమాంబ సమైక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ఉత్సవ కమిటీ చైర్మన్లు మంత్రి శంకర నారాయణ, ములగపాక అచ్చింనాయుడు తెలిపారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఉత్సవాల పోస్టర్‌ను ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా 19న అమ్మవారి ఘటాల ఊరేగింపు, 25న తొలేళ్ల ఉత్సవం, 26న అనుపు మహోత్సవం ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

డాక్టర్ రఘునాథరావుకు బీసీ రాయ్ పురస్కారం

అగనంపూడి : క్యాన్సర్ నివారణపై పరిశోధనలు చేస్తున్న ప్రముఖ ఆంకాలజిస్ట్, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ డి.రఘునాథరావును బీసీ రాయ్ జాతీయ అవార్డుతో ఘనంగా సత్కరించారు. విజయవాడలోని ఆంధ్రా లయోలా కళాశాల ప్లాటినమ్ జూబ్లీ వేడుకల సందర్భంగా మిజోరాం గవర్నర్ డాక్టర్ కంభంపాటి హరిబాబు చేతుల మీదుగా రఘునాథరావుకు గురువారం ఈ పురస్కారాన్ని అందజేశారు. రఘునాథరావు అగనంపూడిలో హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటుకు విశేష కృషి చేయడంతో పాటు వ్యవస్థాపక డైరెక్టర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా మిజోరాం గవర్నర్ డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ క్యాన్సర్ నివారణకు రఘునాథరావు చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. ఇటువంటి మహోన్నత వ్యక్తిత్వం గల రఘునాథరావు లయోలా కళాశాల పూర్వ విద్యార్థి కావడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు.


మిజోరాం గవర్నర్ హరిబాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న డాక్టర్ రఘునాథరావు

నేటి నుంచి నల్లబ్యాడ్జీలతో ఉక్కు అధికారుల నిరసన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారులు శుక్రవారం నుంచి నిరసన బాట పడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకానున్నారు. ఈ మేరకు ఉక్కు అధికారుల సంఘం (సీ) నాయకులు గురువారం సీఎండీకి వినతిపత్రం అందజేశారు. 2020 నుంచి నిలిపి వేసిన పదోన్నతులు ఇవ్వాలని, 2017 నుంచి వేతన ఒప్పందం అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పెన్షన్ ఫండ్ బకాయిలు జమ చేయాలనే తదితర డిమాండ్లతో వారు నిరసన చేపడుతున్నారు. సిబ్బంది తగ్గిపోవడంతో ఉన్న అధికారులపై పనిభారం పెరుగుతున్నా అధికారులపై వివక్ష చూపటం సరికాదని లేఖలో పేర్కొన్నారు.